# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారతీయులు సామరస్యాన్ని ప్రోత్సహిస్తారని, శాంతి కోసం నిలబడతారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఉగాది నుంచి రాష్ట్రంలో పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను నెరవేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.**
5. **తెలంగాణాలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు ప్రక్రియను ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రారంభించనున్నారు.**

==========================

భారతీయులు సామరస్యాన్ని ప్రోత్సహిస్తారని, శాంతి కోసం నిలబడతారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కృత్తిమ మేధ పరిశోధకులు, పోడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో జరిగిన పోడ్‌కాస్ట్‌లో ప్రధానమంత్రి రష్యా-ఉక్రెయిన్ వివాదంపై మాట్లాడుతూ.. రెండు దేశాలు చర్చలకు వచ్చినప్పుడే వివాదానికి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. భారత్, చైనాలు ప్రపంచ అభివృద్ధికి దోహదపడ్డాయని, ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు భవిష్యత్తులో కొనసాగాలని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. పొరుగు దేశాల మధ్య విభేదాలు ఉన్నాయని, అవి వివాదాలుగా మారకుండా చూసుకోవడమే తమ లక్ష్యమని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మ త్యాగం తెలుగువారి దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నిన్న అమరావతిలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా రాజధాని అమరావతిలో స్మారక పార్కును నిర్మించి, 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ ఉగాది నుంచి రాష్ట్రంలో పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో పేదరిక నిర్మూలన, ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలనూ మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్ 37 సెకన్లు

---------------------------

ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను నెరవేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్ సభ ఎన్నికల హామీలలో భాగంగా వరంగల్‌కు విమానాశ్రయం తీసుకువచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. జనగాం జిల్లా స్టేషన్‌ఘనాపూర్‌లో 8 వందల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా శివునిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఒక్క ఏడాదిలోనే తమ ప్రభుత్వం 84 వేల కోట్ల రూపాయల వడ్డీ, 64 వేల కోట్ల రూపాయల మేర అసలు చెల్లించిందనీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు కూడా తెలియాల్సిన అవసరం ఉందనీ రేవంత్ రెడ్డి పేర్కొంటూ..

...వాయిస్.. 29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3 వేల 450 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6 లక్షల 49 వేల 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9 గంటల 30 నిముషాల నుండి 12 గంటల 45 నిముషాల వరకు పరీక్ష జరుగుతుంది. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వరకు ఆర్.టి.సి. బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అవసరమైన పరీక్షా కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏదైనా అవసరం ఉన్న వారు 0866 – 297 4540 నంబర్ కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు.

కాగా పదో తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. విద్యా సంవత్సరంలో పరీక్షలనేవి మైలురాళ్లని, ఏకాగ్రత, శ్రమతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్స్ వేదికగా సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభవలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద, హెూమియోపతి వైద్య వృత్తిదారుల నమోదు (సవరణ) బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదం కోరనున్నారు. అనంతరం పీ4 విధానం, సంక్షేమంపై శాసనసభలో లఘు చర్చ జరగనుంది. శాసనమండలిలో ఉద్యోగుల సమస్యలపై లఘు చర్చ నిర్వహించనున్నారు. భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల (సవరణ) బిల్లును ఆమోదించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసనమండలిలో కోరనున్నారు.

---------------------------

తెలంగాణాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఈరోజు నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

ప్రభాకర్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్నారు. అనంతరం ఆయా సంక్షేమ శాఖలు అభ్యర్థుల నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నాయి. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి తాజాగా సమీక్ష నిర్వహించి పథకం విధివిధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత యువతకు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందుబాటులో తీసుకొచ్చామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

---------------------------

మచిలీపట్నం నగరాన్ని ఆదర్శనీయ ఐకానిక్ నగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పురాతన చరిత్ర కలిగిన మచిలీపట్టణాన్ని విజయవాడ నగరానికి ధీటుగా తీర్చిదిద్దుతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మచిలీపట్నం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించిందని, కోనేరు సెంటర్‌లో పాత భవనాల స్థానంలో మచిలీపట్టణ చరిత్ర ప్రతిబింబించేలా నూతన భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్–పేపర్ 1, లాజిక్ –పేపర్ 1, బైపీసీ విద్యార్థులకు మేథమెటిక్స్ బ్రిడ్జ్ కోర్సు–పేపర్1 పరీక్షలకు సెట్ నెంబరు 1 ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారు.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్ పేపర్ 1 , ఎకానమిక్స్ పేపర్ –1 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

తెలంగాణాలోని సంక్షేమ వసతిగృహాల్లో 581 సంక్షేమ వసతి గృహాల అధికారుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను టీజీపీఎస్సీ ఈరోజు వెల్లడించనుంది. ఈ పోస్టులకు గతేడాది జూన్ 24 నుంచి 29 వరకు కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలకు 82 వేల 873 మంది హాజరయ్యారు. కాగా కమిషన్ ఇప్పటికే పరీక్షల ఫలితాలను వెల్లడించి, ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. నిన్న అనకాపల్లి జిల్లా నాతవరంలో అత్యధికంగా 42.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా నంద్యాల జిల్లా రుద్రవరం, విజయనగరం జిల్లా పెదనందిపల్లిలో 41.8, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.4, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట, అప్పయ్యపేటలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈరోజు రాష్ట్రంలోని 202 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

=====================